డిశంబరు నెల.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటినా ఇంకా చలి పోలేదు.

భర్త, పిల్లలు బైటికెళ్ళగానే రణరంగంలావున్న ఇంటిని సర్దుకుని భోంచేసి, ఓ పుస్తకం తీసుకుని మంచంమీద వాలింది విరజ..

నాలుగు పేజీలు చదివిందో లేదో వీధితలుపు తట్టిన శబ్దం అయింది.

వినుక్కుంటూ తలుపుతీసిన విరజ మొహం మతాబులా వెలిగిపోయింది. కారణం ఆమె స్నేహితురాలు కృష్ణ కనిపించడమే.

"ఏవిటే తల్లీ! ఇది కలా, నిజమా" అంటూ ఆమెని చేతులతో చుట్టేస్తూ లోపలికి లాక్కొచ్చి మంచంమీద కూలేసింది.

చకచకా కాఫీ కలిపిచ్చింది.

"ఇప్పుడు చెప్పు. ఏమిటీ పురుములేని పిడుగు?" కృష్ణ పక్కగా కూర్చుని ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ ఆప్యాయంగా అడిగింది విరజ.

"ఏంలేదే... శ్రీనగర్ వెళ్ళొస్తున్నాం. మా వారికి ఈ వూళ్ళో ఏదో పనుందిట. ఆయనలా వెళ్ళగానే నేనిలా వచ్చేశాను... అవునూ... పిల్లలు, మీ శ్రీవారు బాగున్నారా?" నవ్వుతూ అడిగింది కృష్ణ.

"బ్రహ్మాండంగా వున్నారు. సాయంత్రం చూస్తావుగా" ముసిముసిగా నవ్వింది విరజ.

"సాయంత్రమా! సారీ విరజా—ఓ గంటలో వెళ్ళిపోవాలి. ఫ్లైటుకి టికెట్స్ రిజర్వ్ చేశారు. ఇంతదూరం వచ్చి నిన్ను చూడకుండా వెళ్ళలేక ఇలా వచ్చాను." అంది కృష్ణ.

విరజ మొహం చిన్నబోయింది.

"ఇన్నాళ్ళకొచ్చావ్, కనీసం ఓ పూటయినా వుండకుండా వెళ్తావా!" అంది నిష్ఠూరంగా.

కృష్ణ తన ప్రాబ్లమ్స్ చెప్పింది.

త్వరలో తప్పకుండా వచ్చి రెండు రోజులుంటానని ప్రామిస్ చేసింది.

విరజ టిఫిన్ చేసిపెట్టింది. టిఫిన్ తింటూ చిన్ననాటి ముచ్చట్లు, కాలేజీ కబుర్లు చెప్పుకున్నారు.

"అన్నట్టు విరజా! నీకు శ్రీనగర్ అంటే చాలా ఇష్టంగా. వెళ్ళావా!" హఠాత్తుగా అడిగింది కృష్ణ.


విరజ మొహం చిన్నబోయింది.

"ఎలా కుదురుతుంది కృష్ణా! మావి గొర్రెతోక బతుకులు. మా వారికొచ్చే జీతం రాళ్ళతోనే మేం నలుగురం బతకాలి... " బలవంతంగా నవ్వింది.

"వెళ్ళాలనుకుంటే మార్గమే వుండదా విరజా! అయినా శ్రీనగర్ వెళ్ళడం .ఏదో ఫారిన్‌టూర్ అన్నంత హడలిపోతేవేం. జస్ట్ నాలుగైదువేలు వుచ్చుకుంటే మీరెళ్ళిరావచ్చు."

"నాలుగైదు వేలా!"

"అవును. ట్రైన్‌లో వెళ్తేచాలు. అయినా విరజా! అందరూ లక్షాధికార్లే వుంటారా—ఓ మాదిరివాళ్ళు మాత్రం సుందర ప్రదేశాలు చూడ్డం లేదా? అందునా నువ్వు చిత్రకారిణివి. ప్రకృతిని గూర్చి తెగ కలలు



కనేదానివి. పెళ్ళయి పిల్లలు పుట్టగానే అమ్మమ్మలా తయారయ్యావ్. ప్చ్! ఏం బాగాలేదు." పెద్ద ఉపన్యాసం ఇచ్చింది కృష్ణ.

విరజలోని కళాహృదయం మేలుకోసాగింది. చిన్నతనం నుంచీ కలలు కని, పెళ్ళితో ఆ కలల్ని నిర్దయంగా తరిమేసిన విరజకి శ్రీనగర్‌కెళ్ళాలన్న కోరిక ఇంతైవటుడింతై అన్నట్టు మేలుక్కొని పెరిగిపోయింది.

విరజ మొహంలోని భావాలు గుర్తించిన కృష్ణ శ్రీనగర్ శోభలు వర్ణించి చెప్పింది. దాల్‌లేక్‌లోని బోట్‌హౌస్‌లో ఎన్ని సౌకర్యాలుంటాయో, స్నోఫాల్స్ పడుతుంటే ఎంత అందంగా వుంటుందో, గుర్రం మీద ప్రయాణిస్తుంటే ఎంత థ్రిల్లింగా వుంటుందో, గుల్మార్గ్‌లోని రోప్‌వే ఎంత చూడముచ్చటగా వుంటుందో వివరించి ఆమె కోరికని మరింత పెంచింది.

మరోగంట తర్వాత—"మీ కాశ్మీర్ ట్రిప్ గురించి నాకు వివరంగా లెటర్ రాయాలి" అని చెప్పి వెళ్ళిపోయింది.

విరజకి కళ్ళముందు కాశ్మీర్ అందాలు నృత్యం చేస్తున్నాయి—"ఎలా అయినా సరే శ్రీనగర్ వెళ్ళాలి. ఆయన్ని ఒప్పించాలి" అని నిర్ణయించుకుని, భర్త రాకకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.


విరజ, కృష్ణ ప్రాణ స్నేహితులు. చిన్నప్పట్నించీ ఒకే బళ్ళో చదువుకున్నారు. ఒకే కాలేజీలో డిగ్రీలు సంపాదించుకున్నారు.

అయితే కృష్ణ లక్షాధికారి డా.శాంతారామ్ ఏకైక పుత్రిక. విరజ పేద బడివంతులైన రామారావు అయిదో సంతానం.

విరజ చక్కనిది. దానికితోడు మంచి చిత్రకారిణి. ఆమె గుణగణాలు, రూపురేఖలు చూసి కట్నం కోరకుండా, కోరి చేసుకున్నాడు చిరంజీవి.

చిరంజీవికి కూడా పెద్ద ఆస్తిపాస్తులేం లేవు. ఓ పాటి ఉద్యోగం తప్ప.

వున్నదాంట్లోనే ఓ చిన్న స్వర్గాన్ని సృష్టించుకున్నారా



# విహార యాత్ర

— రావినూతల సువర్ణా కన్నన్

దంపతులు.

అలాంటి సమయంలో కృష్ణ రాక విరజ మనసులో అలజడిని రేపింది.

శ్రీనగర్ ట్రిప్ గురించి భర్తకి ఎలా చెప్పాలా, ఎలా ఒప్పించాలా అని ఆలోచిస్తూండిపోయింది చాలాసేపు.

"అమ్మా!" అంటూ పరిగెత్తుకొచ్చారు ఏడేళ్ళ అరుణ, ఆరేళ్ళ అజయ్.

అప్పుడు గుర్తొచ్చింది విరజకి పిల్లలకి టిఫిన్ చెయ్య లేదని.

చకచకాలేచి, పిల్లలకి స్నానం చేయించి టిఫిన్ చేసిపెట్టి ఆడుకోవడానికి బైటికి పంపింది.

ఏడుగంటలవుతుండగా చిరంజీవి వచ్చాడు.

"మా కృష్ణ వచ్చిందండీ" భర్తకి కాఫీ అందిస్తూ అంది విరజ.

"కృష్ణా?"

"ఆఁ అదే మా ఫ్రెండ్. డాక్టర్ శాంతారామ్‌గారమ్మాయి."

"ఓ! ఏవిటి సంగతి?" నవ్వుతూనే అడిగాడు చిరంజీవి.

అంతా వివరించింది విరజ.

క్షణం నిర్ఘాంత పోయాడతను.

"మనం ఎలా వెళ్తాం విరజా" అన్నాడు మెల్లగా.

"ఎందుకెళ్ళలేం. బ్యాంకులో మూడువేలుంది. మీ ఆఫీసులో లోన్ తీసుకుంటే హాయిగా వెళ్ళిరావచ్చు. ప్లీజ్! నాకు ఎన్నాళ్ళనించో మంచుకొండలు, స్నోఫాల్స్ చూడాలని కోరిక" భర్త భుజంమీద చేతులు వేసి గోముగా అడిగింది విరజ.

చిరంజీవి మాట్లాడలేదు.

నిజానికి విరజ ఇలాంటి, స్థితికిమించిన కోరిక ఏనాడూ కోరలేదు.

"విరజా! శ్రీనగర్ ట్రిప్పంటే మాటలుకాదు. నాలుగైదువేలుంటే చాలదు..." అంటూ ఏదో చెప్పబోయాడు. అయినా విరజ వినిపించుకోలేదు. ఎలాగైనా శ్రీనగర్ వెళ్ళితీరాలని పట్టుపట్టింది.

దిక్కు తోచలేదు చిరంజీవికి. కాస్సేపు తర్వాత

"సరే ప్రయత్నిస్తాను. రేపు సమ్మర్లో వెళ్దాం" అన్నాడు.

"అబ్బే! సమ్మర్లో స్నోఫాల్స్ అస్సలుండవటండీ. పళ్ళు, పూలు ఎక్కడైనా చూడవచ్చు. ఒక్కసారి ఫాల్‌చూస్తే చాలు. అబ్బ! ఆ స్నోలో తడుస్తూ పరిగెడుతుంటే" తన్మయత్వంగా అంది విరజ.

భార్య కళ్ళల్లోకి పరిశీలనగా చూశాడు చిరంజీవి. ఆమె కళ్ళలో ధృఢనిశ్చయం కనిపించిందతనికి.

"సరే. చూద్దాంలే" అన్నాడు.

విరజ మొహం వెలిగిపోయింది.

* * *

ఆఫీసు లోన్ చేతికొచ్చింది.

బ్యాంకులో వున్నదీ డ్రా చేసి తెచ్చారు. ఎక్కడో పెట్టెల అడుగున పడేసిన స్వెట్టర్లు, మఫ్లర్లు బైటికి తీసింది విరజ.

కాశ్మీర్ ట్రిప్‌ని తల్చుకుని విరజ, పిల్లలు కూడా మురిసిపోతున్నారు. చిరంజీవి కూడా వాళ్ళ ఆనందాన్ని తృప్తిగా చూస్తున్నాడు.

కాశ్మీర్ వెళ్ళేరోజు దగ్గరపడుతున్నకొద్దీ విరజ హృదయం పున్నమినాటి సంద్రంలా ఎగసిపడుతోంది. కాలం కదలనట్లనిపిస్తోంది. ఎలాగో ఆ రోజు రానేవచ్చింది. రెండు సూట్‌కేసులతో తమిళనాడ్‌లోని త్రీటైర్ కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించారు నలుగురూ.

కిటికీలోంచి వెనక్కి పరిగెడుతున్న చెట్లనీ, పుట్టల్నీ చూస్తూ చాలాసేపు కూర్చున్నారు పిల్లలు. తర్వాత పక్కలమీదికి ఒదిగారు.

అందరి మనసులూ కాశ్మీర్ అందాలమీదే.

తెల్లవారింది.

ట్రైన్ గమ్యం చేరింది.

అందరూ ఉత్సాహంగా దిగారు.

చలిగాలి ఈ చెవుల్లోంచి ఆ చెవుల్లోకి కొట్టింది.

ఎంత స్వెట్టర్లు తొడుక్కుని మఫ్లర్లు చుట్టుకున్నా చలి ఒణికించేస్తోంది.

"అమ్మో! ఎంత చలో" భుజాలమీద చేతులు పెట్టుకుని ఒణుకుతూ అంది అరుణ.

"అమ్మా! ఇదే నా కాశ్మీరంటే?" చుట్టూచూస్తూ అడిగాడు అజయ్.

"ఉఁహూ ఇది ఢిల్లీ.అంటే మనదేశ రాజధాని అన్న మాట" అంది విరజ ఉత్సాహంగా.

"అయితే కాశ్మీర్లో ఇంత చలి వుంటుందా?" అమాయకంగా అడిగాడు అజయ్.

"వుండదు. అక్కడ కాంగ్రీలని వుంటాయి. వాటివల్ల మనకి చలే తెలియదు" కృష్ణ చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ అంది విరజ.

టూరిస్ట్ బస్‌లో ఢిల్లీ అంతా చూశారు. ఆగ్రాలోని తాజ్‌మహాల్ చూసి మురిసిపోయింది విరజ. ఆమెలోని

కళాతవస్వి మేలుకున్నారు.

అయితే ఆమె పొందిన ఆనందం మిగతావాళ్ళు పొందడంలేదు. పిల్లల మొహాలు వాడిపోయాయి. చిరంజీవి కూడా అంత ఉత్సాహంగా లేదు.

ఎలాగో ఢిల్లీ అంతా చూడ్డం అయిందనిపించి, జమ్మూతావి ఎక్స్‌ప్రెస్‌లోకొచ్చిపడ్డారు.

"జనం, జనం ఎక్కడ చూసినా జనం".

"అమ్మా ఆకలి! అమ్మా చలి!" అంటూ పిల్లలు ఒకటే గొడవ!

నిజానికి విరజకి కూడా అంత ఉత్సాహంగా లేదు. ఢిల్లీలో మంచి వెజిటేరియన్ భోజనంలేక, తెలిసీతెలియక తెగనడిచిన అలసట ఆమెనీ నీరసింపచేసింది. వీటికితోడు జమ్మూతావిలో రిజర్వేషన్ లేకపోవడాన చాలా అవస్థలు పడాల్సొచ్చింది.

ఎవరికి వాళ్ళే ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ ఎలాగో గడిపారు.

ట్రైన్ జమ్మూలో ఆగింది.

హొటల్ ఏజంట్లు, బస్సుల ఏజంట్లు చుట్టుముట్టారు.

మంచులా అయిపోతున్న శరీరాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ ఓ బస్సులో వెళ్ళి కూర్చున్నారు.

బస్సు బయల్దేరింది.

శ్రీనగర్ వెళ్ళేటప్పుడు నిజంగానే చాలా అందంగా అనిపించాయా పరిసరాలు.

బస్సు పైకెళ్తున్నకొద్దీ చలి మరీ ఎక్కువవుతోంది.

"అమ్మా చలేస్తోంది" ఏడుపుగొంతుతో అంది అరుణ.

"ఇదిగో వచ్చేస్తున్నాం. అక్కడ దిగ్గానే కోటూ అదీ అద్దెకిస్తారు. అప్పుడనలు చలే వుండదు" అనునయంగా అంది విరజ.

అరుణ మొహం మాడ్చుకుని కూర్చుంది. అజయ్ మాత్రం ఏడుపు మొదలుపెట్టాడు. ప్రయాణీకులంతా చిరాగ్గా చూశారు.

చిరంజీవి, విరజ పిల్లల్ని అనునయిస్తున్నారు. అయినా వాళ్ళు వినడంలేదు. 'ఇంటికెళ్ళిపోదాం' అని ఒకటే గొడవ!

రాత్రి పదిగంటలవుతుండగా శ్రీనగర్‌లో ఆగింది బస్. బస్సు ఆగీఆగ్గానే చుట్టుముట్టారు ఏజెంట్స్.

అందరితోపాటు చిరంజీవి వాళ్ళు కూడా దిగారు.

ఎముకలు కొరికే చలి!

పిల్లల మొహాలు చూస్తుంటే విరజకి ఏడుపొచ్చింది.

కాశ్మీర అందాల మీద కాస్త మోజు సన్నగిల్లింది.

చిన్న హొటల్స్‌లో కూడా కాంగ్రీలుంటాయన్న స్నేహితురాలి మాట గుర్తొచ్చి కాస్త వూరడిచెందింది.

ఓ ఏజెంట్ ద్వారా ఓపాటి హొటల్‌కెళ్ళారు. అయితే అక్కడ కృష్ణ చెప్పినట్టు కాంగ్రీలేం లేవు. కంపుకొడుతున్న బ్లాంకెట్స్ తప్ప.

ఆకలితో అలమటించిపోతున్న పిల్లలకోసం ఏదైనా దొరుకుతుందేమో అని హొటల్‌వాళ్ళనడిగాడు చిరంజీవి.

అయితే "ఈ హొటల్ ఓన్లీ లాడ్జింగ్. తిండి కావాలంటే నాలుగు ఫర్లాంగులు నడవాలి" అన్నారు. ఇంక తప్పనిసరిగా బైటికెళ్ళాడు. అయినా అక్కడ పళ్ళు తప్ప మరేంలేవు. అవీ ఆకాశాన్నంటే ధరలతో.

అవే తెచ్చి భార్యకిచ్చాడు.

గొడవచేస్తున్న పిల్లలకి అవే పెట్టి నిద్రపుచ్చింది విరజ.

విరజ మొహం చూసిన చిరంజీవికి జాలేసింది. ఆమె కళ్ళు ఏదో తప్పు చేసినట్టు వాలిపోయాయి. ఇద్దరూ మౌనంగా పిల్లల పక్కన పడుకున్నారు.

భారంగా తెల్లవారింది.

అయితే మునురు!

చలికితోడు ప్రచండమైన ఈదురుగాలి మొదలయింది.

కిటికీలోంచి బైటికిచూసిన చిరంజీవి—

"విరజా" అంటూ ఓ గావుకేక పెట్టాడు. ఆమె కంగారుగా కిటికీదగ్గరకొచ్చింది.

స్నోఫాల్!

పూల వర్షంలా పడుతోంది.

విరజ మొహం వెలిగిపోయింది.

"ఓహ్! గుల్మార్గ్‌లోనే స్నోఫాల్స్ వుంటాయంది కృష్ణ. కానీ ఇక్కడే పడుతోంది" అంది ఆనందంగా. భార్య మొహంలోని ఆనందాన్ని చూసిన చిరంజీవి తృప్తిగా


## "మెరి"...మిరిమిట్లు గొలిపే ప్రపంచ ప్రసిద్ధిపొందిన 22ct. గోల్డు కవరింగు నగలు!

తరములకు తారవంటిది! అందాన్ని అధికమించేది, అందరిని ఆకర్షించేది, గ్యారంటీతో ఎనలేని డిజైన్లులతో మురిపించేది. అందులో మీకు కావలసిన నగల నెంబర్లు గుర్తించండి. ఆ నగలు మీకు పంపబడును. వి. పి. పి. చార్జీలు ఎక్స్ట్రా. క్యాటలాగు ఉచితముగా పంపబడును. వెంటనే వివరములకు వ్రాయండి.




# MERI GOLD COVERING WORKS

P.O. BOX : 1405, 14, RANGANATHAN STREET, T. NAGAR, MADRAS-600 017.

నిట్టూర్చారు.

వాన పెరిగింది.

పిల్లల గొడవా పెరిగింది.

"ఆకలి! పాలు కావాలి. చలి! ఇంటికెళ్ళిపోవాలి" అంటూ ఏడుపు ప్రారంభించారు.

విరజకేంచెయ్యాలో తోచలేదు. రానురానూ వాన పెరిగిపోతోంది.

"ఛ! ఇంతసేపు స్నోఫాల్ కురిస్తే బావుండదు" గొణిగినట్లు అంది విరజ.

చిరంజీవి నవ్వాడు.

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు గోచరించాయి విరజకి.

"సారీ! నా మూలంగానే ఈ బాధలు" అంది బాధగా.

"ఛ! ఛ! అదేంలేదు. ఇదీ ఒక అనుభవమే. నేనలావెళ్ళి ఏదైనా తినడానికి తెస్తాను. నువ్వు పిల్లల్ని చూస్తుండు" అన్నాడతను.

"మరి. వాన?" కంగారుగా అందామె.

"పరవాలేదు" అంటూ ఓ బేగ్, ఫ్లాస్క్ తీసుకుని బైటికెళ్ళాడు చిరంజీవి.

స్నోఫాల్లో తడుస్తూ చాలాచోట్ల తిరిగాడు. కానీ ఆకలి తీరేలా వుండే పదార్థాలేం కనిపించలేదు. బహుశా అతనికి కొత్తమూలాన కావచ్చు. చివరికి బజ్జీల్లాంటివి తీసుకుని ఫ్లాస్క్ నిండా టీ పోయించుకుని తిరిగొచ్చాడు.

వాటినే అరుణ ఆత్రంగా తింటే అజయ్ మాత్రం అన్నం, పాలూ కావాలని ఏడుపు మొదలుపెట్టాడు.

తల్లిదండ్రులిద్దరూ ఎంతోసేపు బుజ్జగించారు. అయినా వాడు ఏడుపుమానలేదు. బలవంతంగా తాగించకపోతే గ్లాసుని విసురుగా తోసేశాడు. గ్లాసులోని టీ అంతా నేలపాలయింది.

విరజలోని ఓర్పు నశించింది. కొడుకుని కోపంతో బాదేసింది.

ఆమె ఆవేశానికి భర్త, పిల్లలూ కూడా ఆశ్చర్యపోయారు. తర్వాత విరజకి కూడా దుఃఖం వచ్చింది.

"కాశ్మీర్ ట్రిప్ ఇంతచేదుగా వుంటుందా" అనుకుంది మొదటిసారిగా.

తర్వాత ఎలాగో పిల్లలచేత బజ్జీలు తినిపించి, కాస్త టీ తాగించింది.

మర్నాటికల్లా వాన తగ్గిపోయి సూర్యరశ్మి కనిపించింది.

చూడాల్సిన ప్రదేశాలల్లా చూశారు. అది సీజన్ కాకపోవడం మూలంగా ఎండిన మోళ్ళలావున్న చెట్లు తప్ప పచ్చని చెట్లు ఎక్కడా కనిపించలేదు. చెట్లు నించి యాపిల్స్ కోసుకుందామని సరదాపడిన పిల్లలు "యాపిల్ తోటలు" అంటూ చూపించిన మోళ్ళని చూసి నిరాశ పడిపోయారు.

అతిప్రయాసగా అన్నీ చూశారు. డబ్బంతా దాదాపు అయిపోయింది.

సరైన తిండితిప్పల్లేక అందరి మొహాలూ వాడిపోయాయి.

చివరగా గుల్మార్గ్ బయల్దేరారు టూరిస్ట్ వేన్‌లో. చుట్టూ కనిపించినంత మేరా మంచుకొండలే!

వేన్ గమ్యం చేరింది.

"రెండు గంటల్లో ఇక్కడికి రావాలి. లేకపోతే మేం ఆగం" అంటూ హెచ్చరించి మరీ దించాడు డ్రైవర్.

అందరూ ఉత్సాహంగా దిగారు.

స్లెజ్‌బళ్ళవాళ్ళు వాళ్ళని చుట్టుముట్టారు. మంచులో నడవలేనివాళ్ళు వాటిలో ఎక్కారు. పిల్లలిద్దర్నీ ఎక్కించి తాము నడుద్దామనుకున్నారు విరజ, చిరంజీవి. అయితే ఆ బళ్ళని చూసి ససేమిరా ఎక్కమన్నారు పిల్లలు.

రోప్‌వే దగ్గరికెళ్ళాలంటే చాలా దూరం నడవాలి. రోప్‌వేమీద మోజుకొద్దీ పిల్లలు నడుస్తాం అన్నారు.


మంచు ఇంతెత్తున పడివుంది.

అలాగే నడవసాగారు.

అందరి మొహాలూ కందగడ్డలయ్యాయి.

సగందూరం అతిప్రయాసగా నడిచేసరికి మళ్ళీ స్నోవర్షం మొదలయింది.

ఆనందంగా కేరింతలు కొట్టారు కొందరు. ఫోటోలు తీసుకుని మురిసిపోతున్నారు మరికొందరు.



కూరలో నీరు ఎక్కువయితే మూత తీసేసి పన్నని సెగమీద ఉంచాలి.

*

కాల్చిన వంకాయ, దోసకాయలను ఒకసారి నీటిలో ముంచి తొక్కవలిస్తే సులభంగా వస్తుంది.

—గొల్లపూడి శైలజ, హైద్రాబాదు

పిల్లలిద్దరూ ఏడుపు మొదలుపెట్టారు.

నిలవ నీడలేదు.

రానురానూ స్నోఫాల్ పెద్దదవుతోంది. విరజకేంచెయ్యాలో అర్థంకాలేదు.

ప్రయాణీకులంతా చాలా దూరం సాగిపోయారు ఉత్సాహంగా.

వున్నట్టుండి అజయ్ పడిపోయాడు.

కంగారుగా లేవదీసింది విరజ.

వాడి ఒళ్ళు పేలిపోతోంది.

"అమ్మా! నాకు కళ్ళు కనిపించడం లేదు" బావురుమన్నాడు అజయ్.

విరజ ప్రాణం పైనే పోయింది. మరింత కంగారుగా చూశాడు చిరంజీవి.

"ఇప్పుడెలాగండీ" బేలగా అంది విరజ.

ఓ నూతన జంట ఒకరికొకరు పెనవేసుకున్నట్టు నడుస్తూ గునగునలాడుకుంటూ సాగిపోతున్నారు.

"మనం ఇంత బాధపడుతుంటే వాళ్ళంత ఆనందంగా ఎలావున్నారు?" అమాయకంగా అంది విరజ.

"అది వాళ్ళవాళ్ళ స్థితిగతులమీద ఆధారపడుంటుంది విరజా" అన్నాడతను.

"అంటే?"

"ఉండడానికి నీడ, తినడానికి మంచి తిండి, చలినాపడానికి తగ్గ దుస్తులు, అడుగుపెడితే ప్రత్యక్షమయ్యే కార్లు వున్నవాళ్ళకి ఈ కాశ్మీరేం కర్మ ఎడారులు కూడా అందంగానే కనిపిస్తాయి. మనలాంటి సామాన్యులకి ఇలాంటివి అందని పళ్ళే. కనీసం పిల్లలు పెద్దయ్యాకయినా వస్తే కాస్త బావుండేది. మనకున్న ఓపిక వాళ్ళకుండదు కదా!" అనునయంగా అన్నాడు చిరంజీవి.

"తిరిగి వెళ్ళిపోదామండీ" కళ్ళలో నీరు తిరుగుతూ వుండగా అంది విరజ.

"అంతే అలాగే చెయ్యాలి" అన్నాడతను.

పిల్లలిద్దర్నీ చెరొకళ్ళు ఎత్తుకుని కురుస్తున్న స్నోలో తడుస్తూ వేన్ దగ్గరికొచ్చారు.

బాబు కళ్ళు సరిగ్గా కనపడ్డంలేదని గొడవచేస్తున్నాడు.

"మరేం పరవాలేదు. మంచులో తడిస్తే అలా అవుతాయి. మళ్ళీ మామూలుగా అయిపోతాయి" అన్నారెవరో.

శ్రీనగర్‌లో ఓ డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళి అజయ్‌కి ఇంజక్షన్ చేయించాడు చిరంజీవి. మర్నాటికల్లా జ్వరం తగ్గింది.

"అమ్మా ఇంటికెళ్ళిపోదాం" అన్నారు పిల్లలు దీనంగా.

"అలాగేనమ్మా" పిల్లలిద్దర్నీ గుండెలకి అదుముకుంటూ అంది విరజ.

• • •

అమ్మా నాన్నల మధ్య పడుకుని కబుర్లుచెప్తున్న పిల్లలిద్దరూ—

"ఛీ! కాశ్మీర్ ఏం బాగాలేదు" అన్నారు హఠాత్తుగా.

"కాశ్మీర్ బాగుండకపోవడమేం కాదమ్మా, కాశ్మీర్ మనం వెళ్ళడమే బాగాలేదు" నవ్వుతూ అన్నాడు చిరంజీవి.

"అవును అజయ్. నువ్వు పెద్దయ్యాక ఇంకా పెద్ద ఉద్యోగం చేస్తూ మమ్మలందర్నీ ఎంచక్కా విమానంలో తీసికెళ్ళి, ఏ.సి.రూమ్‌లో వుంచి కాశ్మీర్ అందాలన్నీ చూపిద్దువుగాని" మురిపెంగా అంది విరజ.

"ఇంకా వెళ్ళాలనుందా విరజా" అల్లరిగా అన్నాడు చిరంజీవి.

"బావుంది. ఎందుకుండదూ! మనకి డబ్బులేదని కాశ్మీర్ అందంగా లేదనగలమా! ఆ అందాల్ని చూసే స్థితి మనకి రావాలని మాత్రం కోరుకుంటున్నాను."

"అంటే!" కంగారు నటించాడు చిరంజీవి.

"కంగారుపడకండి. ఇప్పట్లో విహారయాత్రలమాట ఎత్తను సరేనా?..."నవ్వేస్తూ అంది విరజ, కాశ్మీర్‌యాత్రలోని చేదుని గుర్తు తెచ్చుకుంటూ.

• • •